# మూతపడుతున్న రైస్ మిల్లులు

- రాష్ట్రవ్యాప్తంగా 320కి పైగా బంద్
- జిల్లాకు 10 మిల్లులు మూత
- ఒకవైపు సర్కారు వేధింపులు.. మరోవైపు నష్టాలు
- మిల్లులను అమ్మకానికి పెడుతున్న యాజమాన్యం



హైదరాబాద్, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రైస్ మిల్లులు మూతపడుతున్నాయి. వెరసి రైస్‌మిల్లుల పరిశ్రమ సంక్షోభంలోకి కూరుకుపోతున్నది. నష్టాలు భరించలేక కొందరు యజమానులు మిల్లులను మూసేస్తుండగా, మరికొందరు అమ్మకానికి పెడుతున్నారు. ప్రస్తుతం అందుతున్న సమాచారం మేరకు జిల్లాకు సగటున 10 మిల్లులు వరకు మూతపడినట్టు రైస్‌మిల్లు పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. హైదరాబాద్ మినహాయిస్తే 32 జిల్లాల్లో ఇప్పటికే 320కిపైగా మిల్లులు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే మరో మూడు నాలుగేండ్లలో రాష్ట్రంలో రైస్‌మిల్లు ఇండస్ట్రీ కనుమరుగు కావడం ఖాయమనే ఆందోళన వ్యక్తమవుతున్నది. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 3,368 మిల్లులు ఉండగా, ఇందులో 2,353 రా రైస్ మిల్లులు, 1,015 బాయిల్డ్ రైస్ మిల్లులు ఉన్నాయి. ఇందులో సుమారు రెండు వేల మిల్లులు నష్టాల్లో నడుస్తున్నట్టు సమాచారం. మరీ ముఖ్యంగా రా రైస్ మిల్లర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిసింది.

### అమ్మకానికి మిల్లులు

నల్లగొండ జిల్లాకు చెందిన ఒక బడా మిల్లర్‌కు ఏడు మిల్లుల్లో భాగస్వామ్యం ఉన్నది. మొన్నటివరకు బాగానే నడిచిన వ్యాపారం కొద్దికాలంగా నష్టాల వైపు పయనించింది. దీంతో ఆయన ఆయా మిల్లులను అమ్మకానికి పెట్టారు. రాష్ట్రంలో చాలామంది రైస్ మిల్లర్లదీ ఇదే పరిస్థితి. ఇటు ప్రభుత్వం, అటు ఎఫ్‌సీఐ, మరోవైపు చోటామోటా నేతల వేధింపులు వెరసి మిల్లర్లపై అన్ని వైపుల నుంచి దాడి మొదలైనట్టు వారు వాపోతున్నారు. తాము వద్దని చెప్పినా వినకుండా ప్రభుత్వం నుంచి ధాన్యం ఇస్తున్నారని, దించుకోకపోతే విజిలెన్స్ దాడులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మిల్లర్లు ఆరోపిస్తున్నారు. ధాన్యం దించుకున్న తర్వాత సీఎమ్మార్ సేకరించే విషయంలో ఎఫ్‌సీఐ అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నదని వాపోతున్నారు. సీఎమ్మార్ తీసుకోవడంలో ఎఫ్‌సీఐ చేస్తున్న ఆలస్యం వల్ల ఆ ప్రభావం ఆర్థికంగా, మానసికంగా తమపై పడుతున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎఫ్‌సీఐ చేస్తున్న తప్పులకు కూడా తమను బాధ్యులు గా చేసి బద్నాం చేస్తున్నారని వాపోతున్నారు. ఇటువంటి బాధలు, నష్టాలను తట్టుకోలేక కొందరు మిల్లర్లు ఏకంగా తమ మిల్లులనే అమ్మకానికి పెడుతున్నట్టు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 320 పైగా మిల్లుల్లో మిల్లింగ్ బంద్ చేయగా పదుల సంఖ్యలో మిల్లులు అమ్మకానికి పెట్టినట్టు తెలిసింది. అయితే, వాటిని కొనేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని సమాచారం. ప్రస్తుత పరిస్థితుల్లో రైస్‌మిల్లుల వ్యాపారం జోలికి వెళ్లకపోవడమే ఉత్తమమనే అభిప్రాయం ఇండస్ట్రీలో వ్యక్తమవుతున్నది. దీంతో మిల్లర్లు తమ మిల్లులను అమ్ముకోలేక, వాటిని కొనసాగించలేక నానా అవస్థలు పడుతున్నారు.

### మిల్లర్లపై కత్తిగట్టిన సర్కారు

రైస్ మిల్లర్లపై కాంగ్రెస్ సర్కారు కత్తిగట్టిందని, మిల్లర్లను దొంగలుగా చిత్రీకరించేవిధంగా వ్యవహరిస్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిల్లర్లను దొంగలంటూ కించపరిచే వ్యాఖ్యలు చేయడం గమనార్హం. సర్కారుకు తమ బాధలు చెప్పుకొనే పరిస్థితి లేదని, వినేవాళ్లే కరువయ్యారంటూ మిల్లర్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఏ మంత్రి వద్దకు వెళ్లినా తమ గోడు వినడం లేదని వాపోతున్నారు. ఇండస్ట్రీలో కొద్దిమందిగా ఉన్న చెడ్డవారిని చూపించి, ఆ నెపాన్ని మొత్తం ఇండస్ట్రీకి ఆపాదించి ఇబ్బంది పెట్టడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మిల్లర్లకు 'టెండర్' పోటు...

రాష్ట్రంలోని మెజార్టీ మిల్లర్లపై 2022-23 ధాన్యం టెండర్ల ఎఫెక్ట్ పడింది. టెండర్ ధాన్యం పేరుతో మిల్లర్లను ఒక రేంజ్‌లో ఇబ్బందులకు గురిచేసినట్టు తెలిసింది. టెండర్ దక్కించుకున్న కంపెనీలు ధాన్యం ఎత్తకుండా, ధాన్యానికి బదులుగా డబ్బులు ఇవ్వాలని మిల్లర్లపై ఒత్తిడి తెచ్చినట్టు ఆరోపణలున్నాయి. ఇప్పటివరకు మొత్తం 35 లక్షల టన్నుల ధాన్యం వేలం వేయగా, ఆయా కంపెనీలు మాత్రం 20 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే ఎత్తినట్టు తెలిసింది. ఇందులోనూ కేవలం 2-3 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే భౌతికంగా తీసుకెళ్లి, మిగిలిన మొత్తానికి పేపర్లపైనే తతంగం నడిపినట్టు సమాచారం. ఇందులో భాగంగానే మిల్లర్ల నుంచి టెండర్ ధరకు అదనంగా రూ.200-300 వరకు వసూలు చేసినట్టు ఆరోపణలు వినిపించాయి. మిల్లుల్లో ధాన్యం ఉన్న మిల్లర్ల నుంచి కూడా ధాన్యం తీసుకోకుండా డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేసినట్టు ఆరోపణలున్నాయి. ఈ విధంగా కొంత మంది మిల్లర్లు టెండర్ ధాన్యం వల్ల నష్టాల పాలైనట్టు చర్చించుకుంటున్నారు.

### సన్నబియ్యం పరేషాన్

ఇప్పటికే ఉన్న ఇబ్బందులు చాలవన్నట్టుగా తాజాగా సన్న బియ్యం పేరుతో ప్రభుత్వం తమపై మరో పిడుగు వేసిందని మిల్లర్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. యాసంగిలో సన్న ధాన్యం నుంచి నిబంధనల మేరకు బియ్యం రావడం కష్టమని, అయినప్పటికీ ఇవ్వాల్సిందేనంటూ అధికారులు ఒత్తిడి చేస్తున్నట్టు తెలిసింది. ఎఫ్‌సీఐ నిబంధనల ప్రకారం ప్రతి క్వింటాల్ ధాన్యానికి 67 కేజీల బియ్యం రావాలి. కానీ, యాసంగిలో క్వింటాల్ సన్న ధాన్యం నుంచి 50-55 కేజీల వరకు బియ్యం వస్తాయి. మిగిలిన 17 కేజీల భారం ఎవరు భరించాలని మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఒత్తిడితో ఆ భారం మిల్లర్లే భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి నివేదించినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

## దెబ్బ తిన్న పంటలకు పరిహారం చెల్లించాలి

- ప్రభుత్వానికి అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు డిమాండ్
- మానవపాడులో తడిసిన మిర్చి పంట పరిశీలన

మానవపాడు, ఏప్రిల్ 21 : జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలో అకాల వర్షానికి పూర్తిగా తడిచిపోయిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం కురిసిన వానతో కల్లాల్లో ఆరబోసిన మిరప, పొగాకు పంటలు తడిసి ముద్దయ్యాయి. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే సోమవారం గ్రామానికి వెళ్లి నీటిపాలైన పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు పెద్ద ఎత్తున పంటలను కోల్పోయారని, పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని భరోసానిచ్చారు.

## పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి ఇద్దరు రైతుల మృతి

ధర్మపురి/మహాముత్తారం, ఏప్రిల్ 21 : పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లిన ఓ ఇద్దరు రైతులు మృతిచెందారు. జగిత్యాల జిల్లాలో కరెంట్ షాక్‌తో ఒకరు, భూపాలపల్లి జిల్లాలో పాముకాటుకు ఇంకొకరు మరణించారు. వివరాలు ఇలా.. జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గోపులాపూర్‌కు చెందిన రైతు గోవిందుల మల్లేశం (58) సోమవారం ఉదయం తన పొలానికి సాగు నీరు పెట్టడానికి వెళ్లాడు. అక్కడ మోటర్ స్విచ్‌బోర్డు ఆన్ చేస్తుండగా.. కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం కోనంపేటకు చెందిన చిడం లక్ష్మయ్య (67) ఆదివారం గ్రామ సమీపంలోని పొలం వద్దకు వెళ్లాడు. కరెంటు మోటర్ ద్వారా పొలానికి నీళ్లు పెట్టే క్రమంలో పాము కాటు వేసింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే భూపాలపల్లి దవాఖానకు తరలించారు. అనంతరం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా సోమవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

## అకాలవర్షం.. పంట నష్టం

**పలు జిల్లాల్లో రైతన్న ఆగమాగం**

జగదేవ్‌పూర్, మద్దూరు (ధూళిమిట్ట), హుస్నాబాద్ టౌన్, మహ్మదాబాద్, ఏప్రిల్ 21: సిద్దిపేట సహా పలు జిల్లాల్లో సోమవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సిద్దిపేట జిల్లాలోని జగదేవ్‌పూర్, ధూళిమిట్ట, హుస్నాబాద్ మండలాల్లో భారీ నష్టం జరిగింది. జగదేవ్‌పూర్ మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని చెట్లు విరిగిపడ్డాయి. మండలంలోని పీర్లపల్లి, ధర్మారం, గొల్లపల్లి, అలిరాజ్‌పేట, నిర్మల్‌నగర్, దౌలాపూర్ గ్రామాల్లో వడగండ్ల వాన బీభత్సం సృష్టించడంతో చేతికొచ్చిన వరి ధాన్యం నేలరాలింది. మామిడి కాయలు రాలిపోయాయి. విద్యుత్ వైర్లు తెగిపడటంతో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ధూళిమిట్ట మండలవ్యాప్తంగా వడ్లు, మామిడికాయలు నేలరాలాయి. చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకూలాయి. ధూళిమిట్టకు చెందిన జెల్ల స్వరూప, కమ్మరి లక్ష్మీనారాయణలకు చెందిన రేకుల ఇంటి పైకప్పులు లేచిపోయాయి. ధూళిమిట్టలో తడిసిన ధాన్యాన్ని తహసీల్దార్ సింహాచలం మధుసూదన్ పరిశీలించారు. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యం తడిసింది. తడిసిన ధాన్యాన్ని బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్ మండలంలో కురిసిన వానతో ధాన్యం తడిసింది. మండలంలోని వెంకట్‌పల్లి, మహ్మదాబాద్ కొనుగోలు కేంద్రాల్లో ఉన్న దాదాపు 600 బస్తాల ధాన్యం తడిసి ముద్దయింది.



మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్ మండల కేంద్రంలో తడిచిన ధాన్యం



మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్ మండలం కంచన్‌పల్లిలో వాననీటిలో ధాన్యాన్ని సేకరిస్తున్న రైతు



కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం గొల్లపల్లి శివారులో ఎన్‌హెచ్ నిర్మాణ సంస్థ డీబీఎల్ కంపెనీ సైట్ ఇంజినీర్ తోయడంతో బావిలో పడిన కాసు మచ్చయ్య

## రైతుపై దాడి చేసి.. బావిలోకి తోసేసి

**పరిహారం అడిగితే సిబ్బంది దౌర్జన్యం**

శంకరపట్నం, ఏప్రిల్ 21: పరిహారం ఇవ్వకుండా బావిని పూడ్చవద్దన్నందుకు డీబీఎల్ కంపెనీకి చెందిన సిబ్బంది రైతును వ్యవసాయ బావిలోకి తోసివేసిన ఘటన కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం గొల్లపల్లిలో జరిగింది. బాధిత రైతు కాసు మచ్చయ్య కథనం ప్రకారం.. మచ్చయ్యకు గ్రామ శివారులోని సర్వే నంబర్ 17లో వ్యవసాయ బావి ఉంది. ఎన్‌హెచ్‌ఏఐ-563 రోడ్డు విస్తరణలో భాగంగా కోల్పోతున్నాడు. డీబీఎల్ సంస్థ విస్తరణ పనుల్లో భాగంగా సోమవారం మచ్చయ్య బావిని పూడ్చివేస్తుండగా పరిహారం చెల్లించకుండా పూడ్చవద్దని రైతు అడ్డుకున్నాడు. సైట్ ఇంజినీర్ నిరంజన్ మచ్చయ్యను బూతులు తిడుతూ, పక్కనే ఉన్న బావిలోకి తోశాడు. మచ్చయ్య కొడుకు వెంటనే తండ్రిని తాడు సహాయంతో బయటకు లాగి, హుజూరాబాద్ దవాఖానకు తరలించారు.

## మంత్రి ప్రారంభించినా జొన్న కొంటలేరు

- ఆదిలాబాద్ మార్కెట్ యార్డు ఎదుట రైతుల పడిగాపులు
- ఎండవేడిమికి తాళలేక ఇక్కట్లు
- సాంకేతిక కారణాలతో కొనుగోళ్లు జరపడం లేదు: అధికారులు



ఆదిలాబాద్ మార్కెట్ యార్డు ఎదుట పెద్దసంఖ్యలో నిలిపి ఉన్న జొన్న పంట వాహనాలు

ఆదిలాబాద్, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో రైతులు పంటను అమ్ముకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. జొన్న పంట చేతికొచ్చి 15 రోజులు దాటినా కొనుగోళ్లు జరగడం లేదు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క శనివారం ప్రారంభించారు. తలమడుగు మండలం కజ్జర్ల రైతులు సోమవారం ఉదయం వాహనాల్లో భారీగా పంట విక్రయానికి ఆదిలాబాద్ మార్కెట్‌కు తీసుకొచ్చారు. మార్కెట్ గేటుకు తాళం వేసి ఉండటంతో 43 డిగ్రీల ఎండలో పడిగాపులు కాయాల్సి వచ్చింది. పంటను కొనుగోలు చేయాలని మార్కెటింగ్ అధికారులను కోరినా ఫలితం లేకుండా పోయింది. ఎకరాకు 14 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేస్తున్నందున.. ఆ వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కాకపోవడంతో కొనుగోళ్లు జరపడం లేదని అధికారులు తెలిపారు. మంగళవారం నుంచి జొన్న పంట కొనుగోళ్లు చేపడతామని వారు పేర్కొన్నారు.



పెంచికల్‌పాడ్ జొన్న కొనుగోలు కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

## ఎకరాకు 20 క్వింటాళ్లు కొనాలని నిరసన

**పెంచికల్‌పాడ్ కేంద్రం వద్ద రైతుల ఆందోళన**

కుంటాల, ఏప్రిల్ 21 : నిర్మల్ జిల్లా కుంటాల మండలం పెంచికల్‌పాడ్ కొనుగోలు కేంద్రం వద్ద సోమవారం రైతులు ఆందోళనకు దిగారు. జొన్న పంటను ఎకరాకు 20 క్వింటాళ్లు కొనాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కల్లూరు, పెంచికల్‌పాడ్, ఓలా, కుంటాల, లింబా (కే) గ్రామాల్లోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఎకరానికి 8.65 క్వింటాళ్లు మాత్రమే తూకం వేస్తున్నారని వారు వాపోయారు. ఎకరాకు జొన్న దిగుబడి 25 నుంచి 30 క్వింటాళ్లు వచ్చిందని, ఆ మేరకు కొనుగోళ్ల పరిమితిని పెంచాలని డిమాండ్ చేశారు.

## మరో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- దిగుబడి లేక.. అప్పులు కట్టలేక
- జనగామ, నిజామాబాద్ జిల్లాల్లో విషాదం



అనపర్తి లక్ష్మి(ఫైల్)

పాలకుర్తి/చందూర్, ఏప్రిల్ 21: అప్పుల బాధతో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనలు జనగామ, నిజామాబాద్ జిల్లాల్లో చోటు చేసుకున్నాయి. జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాలకు చెందిన అనపర్తి లక్ష్మి(52)-శంకరయ్య దంపతులు. వీరు మామిడి తోటలో జీతం ఉన్నారు. ఈ క్రమంలో రెండెకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేశారు. ఇందుకోసం కొంత అప్పు చేశారు. వీటితోపాటు భూమి అమ్మిన వ్యక్తికి రూ.4 లక్షలు ఇవ్వాల్సి ఉన్నది. అంతకుముందే ఉన్న ఎకరం భూమిలో వరి వేయగా ఆశించిన మేర దిగుబడి రాలేదు. ఈ అప్పులు ఎలా తీర్చాలో తెలియక దంపతులు మదన పడుతున్నారు. సోమవారం శంకరయ్య మామిడి తోట నుంచి ఊర్లోకి వెళ్లాడు. తోటలో ఒంటరిగా ఉన్న లక్ష్మి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

**పరువు పోయిందని..**



గోపాల్ రెడ్డి (ఫైల్)

నిజామాబాద్ జిల్లా చందూర్ మండల కేంద్రానికి చెందిన రైతు అర్కల గోపాల్‌రెడ్డి (46) ఎరువులు, పురుగు మందులను ఓ ఫర్టిలైజర్ షాపు నుంచి అరువుమీద కొనుగోలు చేశాడు. వాటికి డబ్బులు చెల్లించకపోవడంతో దుకాణ యజమాని కోర్టు నుంచి నోటీసులు పంపించాడు. పొలం ఎవరికీ విక్రయించవద్దని నోటీసు రావడంతో పాటు గ్రామంలో చాటింపు వేయించారు. గ్రామంలో పరువు పోయిందని తీవ్ర మనస్తాపం చెందిన రైతు సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై మహేశ్ తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

- **పిడుగు పడి పత్తి లారీ దగ్ధం**



పిడుగుపడి లారీ దగ్ధమైన ఘటన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. తమిళనాడుకు చెందిన లారీ కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం చింతపల్లిలోని కవిత కాటన్ ఇండ్రస్టీస్ నుంచి రూ.40 లక్షల విలువ గల 24 టన్నుల పత్తి లోడు చేశారు. ఈ క్రమంలో చిల్లేపల్లి వద్ద మంటలు వ్యాప్తి చెందాయి. పత్తితో పాటు లారీ పూర్తిగా దగ్ధమైంది. -నేరేడుచర్ల

- **కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఫీల్డ్ అసిస్టెంట్ల ధర్నా**



పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని, పేస్కేలు అమలు చేస్తామన్న హామీలను అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. - కరీంనగర్ కలెక్టరేట్

## కొనుగోలు కేంద్రంలో మహిళా రైతు మృతి

- వడ్లు నేర్పుతుండగా ఎండ దెబ్బకు హఠాన్మరణం
- ప్రేమలతది ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వ హత్యే
- 20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి: ఎర్రబెల్లి



మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చెర్లపాలెంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

తొర్రూరు, ఏప్రిల్ 21: ధాన్యం కొనుగోలు కేంద్రంలో మహిళా రైతు ఎండదెబ్బతో హఠాన్మరణం చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చెర్లపాలెంలో సోమవారం చోటుచేసుకున్నది. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని స్వగ్రామంలోని కొనుగోలు కేంద్రంలో వసతులు కల్పించకపోవడంతో రైతు మృతి చెందినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన హనుమాండ్ల వెంకట్రామ్ నరసయ్య, ప్రేమలత (58) దంపతులు. వీరు తమకున్న నాలుగున్నర ఎకరాల్లో వరి సాగు చేశారు. నాలుగు రోజుల క్రితం కోత పూర్తయిన అనంతరం ధాన్యాన్ని వడ్ల కొనుగోలు కేంద్రానికి తరలించి రాశులు పోశారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వడ్లు నేర్పుతుండగా ప్రేమలత అకస్మాత్తుగా ఎండ దెబ్బకు గురై అక్కడికక్క డే కుప్పకూలిపోయింది. ధాన్యం కొనుగోలు కేంద్రంలో నీళ్లు, నీడకు టెంటు, గ్లూకోజ్ లాంటి సౌకర్యాలు లేకపోవడంతో ప్రేమలత మృతి చెందిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా హాస్పిటల్‌కు తరలించినట్టు ఎస్సై రాంజీ నాయక్ తెలిపారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

### ప్రేమలతది ప్రభుత్వ హత్యే

రైతు ప్రేమలత మృతి చెందిన విషయం తెలుసుకున్న వెంటనే మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమలతది ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు ఉండేవని, రైతులకు రక్షణ కల్పించేదని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. చర్లపాలెంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో నీళ్లు, నీడ, వైద్యానికి సంబంధించి ఎటువంటి వసతులు కల్పించకపోవడంతో ఎండదెబ్బతో ప్రేమలత మరణించిందని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరిచి రైతులను రక్షించే చర్యలు తీసుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా రైతులు నిరసనల బాట పట్టే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.